# నమస్తే ఉదయం

తెలుగు దినపత్రిక

సంపుటి: 3 | సంచిక: 258 | పేజీలు: 4 | వెల: రూ.4/- | శుక్రవారం 15 మే 2026 | ఎడిటర్: ఎం.వనితా రెడ్డి


# నీట్ పేపర్ లీక్..
# విద్యార్థుల భవిష్యత్తు నిర్వీర్యం



## కేంద్రం తీరుపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆగ్రహం

### నీట్-యూజీ 2026 రద్దు... మోడీ సర్కార్ ఫెయిల్

### మోడీ హయాంలోనే 93 పేపర్లు లీక్

### ఆందోళనలో రెండు కోట్ల మంది విద్యార్థులు

**హైదరాబాద్, మే 14 (నమస్తే ఉదయం)**

నీట్-యూజీ2026 రద్దు... మోడీ ప్రభుత్వ నియంతృత్వ... నిరంకుశ నిర్ణయమని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి విమర్శించారు. కేంద్ర ప్రభుత్వఏకపక్షరద్దుతో యువత భవితవ్యంపై తీవ్ర ప్రభావం పడుతుందన్నారు. గతపదేండ్లుగాప్రధాని మోడీ హయాంలో93పేపర్లు లీక్ అయ్యాయని ఆగ్రహంవ్యక్తం చేశారు. దీంతో రెండు కోట్ల మంది విద్యార్థులు ఆందోళన చెందుతు న్నారని అన్నారు. పేపర్ లీక్ జరిగితే కనీసం సంబంధిత మంత్రిపై ఎటువంటి చర్యలు తీసుకోలేదని ముఖ్యమంత్రి విమర్శించారు. నీట్ రద్దు.. దేశ ప్రజలను తీవ్ర దిగ్భాంరతికి గురి చేసిన పెద్ద నోట్ల రద్దు వంటిదేనని అన్నారు. కేంద్ర ప్రభుత్వ అనాలోచిత, నిర్లక్ష్యపూరితమైన ఈ నిర్ణయం దేశ యువత భవిష్యత్తును ప్రశ్నార్థకం చేసిందన్నారు. వ్యవస్థీకృతంగా పేపర్ లీక్‌లు, ప్రభుత్వ వైఫల్యాలు దేశ యువతను తీవ్ర అనిశ్చితి, నిరాశలోకి నెట్టాయని చెప్పారు. తీవ్ర ఒత్తిడిలో సంవత్సరాల తరబడి కష్టపడి చదువుకున్న విద్యార్థుల కలలు మోడీ ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా ప్రస్తుతం కల్లలయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఎంతోమంది విద్యార్థుల తల్లిదండ్రులు అప్పులు చేసి, కొంతమంది పేరెంట్స్ నగలు అమ్మి తమపిల్లలనునీట్ ఎగ్జామ్ కు ప్రిపేర్ చేయించారని... వారి ఆశలన్నీగల్లంతవడంబాధాకర మన్నారు. 2019 నుండి 15 రాష్ట్రాల్లో ప్రధాన నియామక పరీక్షల పేపర్లు లీక్ అయినా, ఒక్క కేంద్ర మంత్రి కూడా రాజీనామా చేయలేదని గుర్తు చేశారు. బీజేపీ పాలిత రాష్ట్రాలే ఈ లీక్‌లకు ప్రధాన కేంద్రాలుగా మారాయని సీఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు. గుజరాత్ రాష్ట్రంలోనే ..మిగతా 2లో



# రెండ్రోజులు వర్క్ ఫ్రం హోమ్, నో కార్ డే

## ప్రకటించిన ఢిల్లీ సర్కారు

### ప్రధాని మోదీ పిలుపుతో ఇంధన ఆదాపై ఢిల్లీ సర్కార్ దృష్టి

### ప్రభుత్వ ఉద్యోగులకు వారానికి 2 రోజులు వర్క్ ఫ్రమ్ హోమ్

### అధికారుల వాహనాలకు పెట్రోల్ కోత, కొత్త వాహనాల కొనుగోలుపై నిషేధం

### వారానికి ఒకరోజు 'నో-కార్ డే', సగం మీటింగులు ఆన్‌లైన్‌లోనే

### ప్రజా రవాణాను ప్రోత్సహించేందుకు ప్రత్యేక బస్సులు, 'మెట్రో డే'

**న్యూఢిల్లీ, మే 14 (నమస్తే ఉదయం)**

పొదుపు చేయాలంటూ దేశ ప్రజలకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఇచ్చిన పిలుపునకు ఢిల్లీ సర్కారు స్పందించింది. సీఎం రేఖా గుప్తా ప్రభుత్వం ఇంధన పొదుపు కోసం పలు కీలకమైన, ఆచరణాత్మక చర్యలను ప్రకటించింది. పెరుగుతున్న అంతర్జాతీయ ఇంధన ధరల నేపథ్యంలో విదేశీ మారక నిల్వలపై ఒత్తిడి తగ్గించడమే లక్ష్యంగా గురువారం ఈ నిర్ణయాలు తీసుకుంది. ఈ కొత్త నిబంధనలు ప్రభుత్వ కార్యాలయాల పనితీరు, ఉద్యోగుల ప్రయాణ అలవాట్లలో గణనీయమైన మార్పులు తీసుకురానున్నాయి. ప్రభుత్వం తీసుకున్న ప్రధాన నిర్ణయాలలో ప్రభుత్వ ఉద్యోగులకు వారానికి రెండు రోజులు ఇంటి నుంచి ..మిగతా 2లో

## ఫార్ములా ఈ-కార్ రేసు...
# కేటీఆర్‌కు నోటీసులు

### కేటీఆర్‌కు ఏసీబీ కోర్టు సమన్లు

### జూలై 31న విచారణకు హాజరు కావాలని ఆదేశం

### ఫార్ములా ఈ రేస్ కేసులో ఏ1గా కేటీఆర్



**హైదరాబాద్, మే 14 (నమస్తే ఉదయం)**

తెలంగాణలో సంచలనం రేపిన ఫార్ములా-ఈ రేస్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో పాటు పలువురు కీలక అధికారులకు ఏసీబీ ప్రత్యేక కోర్టు సమన్లు జారీ చేసింది. జూలై 31వ తేదీన విచారణకు వ్యక్తిగతంగా హాజరు కావాలని కోర్టు ఆదేశాలు జారీ చేయడంతో రాష్ట్ర రాజకీయాల్లో మరోసారి నోటీసులు జారీ చేసింది. ఫార్ములా ఈ-కార్ రేసు కేసులో మాజీ మంత్రి కేటీఆర్‌కు ఏసీబీ కోర్టు సమన్లు జారీ ..మిగతా 2లో

# ఇక ఫస్టియర్‌లోనూ ప్రాక్టికల్స్



### తెలంగాణ ఇంటర్‌లో కీలక మార్పులు!

### విద్యార్థుల్లో ప్రాక్టికల్స్ నాలెడ్జ్, కాన్సెప్ట్ ఆధారిత అభ్యాసం పెంచడమే లక్ష్యంగా మార్పులు

### 2026-27 ఆర్థిక సంవత్సరం నుంచి కొత్త విధానం అమలు

### ఇంటర్ ఫస్టియర్ నుంచే ప్రాక్టికల్స్

**హైదరాబాద్, మే 14 (నమస్తే ఉదయం)**

ఇంటర్ విద్యా విధానంలో కీలక మార్పులు చేపట్టేందుకు తెలంగాణ ఇంటర్మీడియట్ విద్యామండలి సిద్ధమైంది. 2026-27 ఆర్థిక సంవత్సరం నుంచి కొత్త విధానాన్ని అమలు చేయాలని నిర్ణయించింది. ఫస్టియర్ నుంచి ప్రాక్టికల్స్, ఫైనల్ పరీక్షకు మార్కుల తగ్గింపు వంటి వివిధ మార్పులు చోటుచేసుకోనున్నాయి. విద్యార్థుల్లో ప్రాక్టికల్ నాలెడ్జ్, కాన్సెప్ట్ ఆధారిత అభ్యాసం పెంచడమే లక్ష్యంగా మార్పులు చేసింది. ఇప్పటి వరకు ఇంటర్ సెకండియర్‌లో ప్రాక్టికల్స్ నిర్వహించేవారు. ఇక నుంచి ఫస్టియర్ నుంచే ప్రాక్టికల్స్ ..మిగతా 2లో

## కరీంనగర్ జ్యువెలరీ
# దోపిడీ మిస్టరీ వీడింది!

### సుబోధ్ సింగ్ గ్యాంగ్ పనే..

### కరీంనగర్ జ్యువెలరీ దోపిడీ కేసులో ముగ్గురు నిందితుల అరెస్ట్

### ప్రధాన సూత్రధారి సుబోధ్ సింగ్ బీహార్ జైలు నుంచే పథకం రచించినట్లు వెల్లడి

### ఈ కేసులో మొత్తం 13 మంది నిందితులను గుర్తించిన పోలీసులు

### బెంగాల్, బీహార్‌లో నిందితులను పట్టుకున్న ప్రత్యేక బృందాలు

### మిగిలిన వారి కోసం వివిధ రాష్ట్రాల్లో కొనసాగుతున్న గాలింపు



**హైదరాబాద్, మే 14 (నమస్తే ఉదయం)**

కరీంనగర్ పట్టణంలో పట్టపగలే జరిగి సంచలనం సృష్టించిన పీఎంజే జ్యువెలరీ షాపు దోపిడీ కేసులో పోలీసులు కీలక పురోగతి సాధించారు. ఈ దోపిడీకి పాల్పడిన అంతర్రాష్ట్ర ముఠా 'సుబోధ్ సింగ్ గ్యాంగ్'కు చెందిన ముగ్గురు సభ్యులను అరెస్ట్ చేసినట్లు కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం మీడియా సమావేశంలో ప్రకటించారు. ఈ కేసులో మొత్తం 13 మంది నిందితులను గుర్తించామని, మిగిలిన వారి కోసం గాలింపు ముమ్మరంగా కొనసాగుతోందని ఆయన వెల్లడించారు. ఈ నెల 3న జరిగిన ఈ దోపిడీలో దుండగులు జ్యువెలరీ షాపులోకి చొరబడి కాల్పులకు తెగబడ్డారు. ఈ ఘటనలో నలుగురు ఉద్యోగులకు బుల్లెట్ గాయాలయ్యాయి. దుండగులు 161 తులాల బంగారు ఆభరణాలు, ..మిగతా 2లో



# 16 రాష్ట్రాలు, 3 కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఎస్ఐఆర్ మూడో దశ

### మే 30 నుంచి దశలవారీగా చేపట్టనున్న ప్రక్రియ : ఈసీ

**న్యూఢిల్లీ, మే 14 (నమస్తే ఉదయం)**

ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) మూడో దశకు సంబంధించి ఎన్నికల సంఘం (ఈసీ) కీలక ప్రకటన వెలువరించింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ సహా 16 రాష్ట్రాలు, మూడు కేంద్రపాలిత ప్రాంతాల్లో మే 30 నుంచి దశలవారీగా చేపట్టనున్నట్లు గురువారం తెలిపింది. దిల్లీ, ఒడిశా, ..మిగతా 2లో



# శబరిమల కేసులో తీర్పు రిజర్వ్ చేసిన సుప్రీంకోర్టు

### మే 29లోపు లిఖితపూర్వక వాదనలకు అనుమతి

### అయ్యప్ప ఆలయంలో మహిళలపై వివక్ష అంశంపై ముగిసిన వాదనలు

### మే 29లోపు లిఖితపూర్వక వాదనలు సమర్పించవచ్చన్న సుప్రీంకోర్టు

**న్యూఢిల్లీ, మే 14 (నమస్తే ఉదయం)**

శబరిమల ఆలయంతో సహా వివిధ మతపరమైన ప్రదేశాల్లో మహిళల పట్ల వివక్ష, మతస్వేచ్ఛపై దాఖలైన పిటిషన్లపై తీర్పును సుప్రీంకోర్టు వాయిదావేసింది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలో 9 మంది సభ్యులతో కూడిన రాజ్యాంగ ధర్మాసనం ఈ కేసును 16రోజులపాటు విచారణ జరిపింది. సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా, ..మిగతా 2లో

# నీట్ పేపర్ లీక్.. విద్యార్థుల భవిష్యత్తు నిర్వీర్యం

మొదటి పేజీ తరువాయి...

14 పేపర్లు లీక్ అయ్యాయన్నారు. 2014 మే నెలలో నరేంద్ర మోడీ అధికారంలోకి వచ్చినప్పటి నుండి, భారతదేశంలోని ప్రభుత్వ పరీక్షా వ్యవస్థలో వ్యవస్థీకృత లోపాలు బహిర్గతమయ్యాయని చెప్పారు. కాంగ్రెస్ విడుదల చేసిన 'ది పేపర్ లీక్ డెకేడ్' శ్వేతపత్రం ప్రకారం, కేంద్ర, రాష్ట్ర పరీక్షలలో 93 పేపర్ లీక్ ఘటనలుజరిగాయని ఈ సందర్భంగా సీఎం ప్రస్తావించారు. వీటివల్ల సుమారు 2 కోట్ల మంది విద్యార్థులు ప్రభావితమయ్యారని చెప్పారు. 2024లో కేవలం ఎనిమిది వారాల్లోనే నాలుగు ప్రధాన జాతీయ పరీక్షలు రద్దయ్యాయని తెలిపారు. నీట్-యూజీ (24 లక్షల మంది అభ్యర్థులు), యుజిసి-నెట్ (9 లక్షలు), సిఎస్ఐఆర్-నెట్, నీట్-పిజిరద్దుఅయినట్టు గుర్తు చేశారు.



2024లో ఉత్తరప్రదేశ్ పోలీస్ కానిస్టేబుల్ పరీక్ష (16 లక్షల మంది మహిళలతో సహా 48 లక్షల మంది అభ్యర్థులు) కూడా కొన్ని రోజుల్లోనే రద్దైందని, ప్రధాని సొంత రాష్ట్రమైన గుజరాత్‌లో 14 ప్రధాన లీక్‌లు జరిగాయన్నారు. ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, హర్యానా వంటి ఇతర బీజేపీ పాలిత రాష్ట్రాలు కూడా ఈ కుంభకోణాల జాబితాలో ఉన్నాయని తెలిపారు. ప్రభుత్వం 2024 ఫిబ్రవరిలో 'పబ్లిక్ ఎగ్జామినేషన్స్ (తప్పుడు మార్గాల నివారణ) చట్టం'ను ఆమోదించినప్పటికీ, పెద్ద కుంభకోణాలు వెలుగు చూసిన తర్వాత, 2024 జూన్ వరకు దాని నోటిఫికేషన్‌ను కేంద్రం ఆలస్యం చేసిందన్నారు. కాగా, తెలంగాణ ముఖ్యమంత్రిగా, విద్యార్థులకు, తల్లిదండ్రులకు సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక హామీ ఇచ్చారు. నీట్రద్దునేపథ్యంలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆందోళన చెందవద్దనిభరోసానిచ్చారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతి విద్యార్థికి, వారి కుటుంబానికి అండగా నిలుస్తుందని హామీనిచ్చారు.

# ఇక ఫస్టియర్‌లోనూ ప్రాక్టికల్స్

మొదటి పేజీ తరువాయి...

ఉంటాయి. ఫిజిక్స్, కెమిస్ట్రీ, బోటనీ, జువాలజీ విభాగాల్లో మొదటి సంవత్సరం విద్యార్థులకు ప్రాక్టికల్స్ నిర్వహిస్తారు. ఫస్టియర్, సెకండియర్‌లలో 15 మార్కుల చొప్పున ప్రాక్టికల్స్ నిర్వహణ ఉంటుంది. దీంతో విద్యార్థులు ఫస్టియర్‌లోనూ థియరీతో పాటు ప్రయోగాత్మక పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేసుకోవాల్సి ఉంటుంది. మ్యాథ్స్ బోధనలోనూ సంప్రదాయ పద్ధతికి భిన్నంగా, యాక్టివిటీ బేస్డ్ లెర్నింగ్‌ను తీసుకురానుంది. దీని ద్వారా విద్యార్థులు సూత్రాలను సులభంగా అర్థం చేసుకోవడం, సమస్య పరిష్కార నైపుణ్యాలు పెంపొందించుకోవడం, కాన్సెప్ట్ ఆధారిత విద్యను అభ్యసించడానికి అవకాశం ఉంటుంది. ప్రస్తుతం మ్యాథ్స్‌లో 75 మార్కులకు ఫైనల్ పరీక్షలు ఉన్నాయి. ఈ మార్కులను 60కి తగ్గించే అవకాశముంది. మిగిలిన మార్కులను ఇంటర్నల్ అసెస్‌మెంట్ ప్రాక్టికల్స్, యాక్టివిటీ బేస్డ్ లెర్నింగ్ ఆధారంగా మిగిలిన మార్కులను కేటాయించవచ్చని సమాచారం. తెలుగు, హిందీ, ఇంగ్లీష్ వంటి భాషా విభాగాల్లో కూడా 20 మార్కులను ఇంటర్నల్ అసెస్‌మెంట్ కింద కేటాయించనుంది. సెమినార్లు, అసైన్‌మెంట్లు, క్లాస్ రూమ్ పనితీరు ఆధారంగా మార్కులు కేటాయించే అవకాశం ఉంది. ఈ కొత్త విధానం ద్వారా విద్యార్థులపై పరీక్షల ఒత్తిడి కొంతమేర తగ్గించే అవకాశం ఉందని విద్యావేత్తలు భావిస్తున్నారు. దీంతో కేవలం ఫైనల్ పరీక్ష ఆధారంగా మాత్రమే కాకుండా, సంవత్సరం పొడవునా విద్యార్థుల పనితీరును అంచనా వేసే విధానం అమల్లోకి వస్తుంది. విద్యార్థుల్లో సృజనాత్మకత, విశ్లేషణాత్మక ఆలోచన, ప్రాక్టికల్ నాలెడ్జ్ పెంపొందించే లక్ష్యంతో జాతీయ విద్యా విధానానికి అనుగుణంగా ఇంటర్ బోర్డు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.

# ఫార్ములా ఈ-కార్ రేసు... కేటీఆర్‌కు నోటీసులు

మొదటి పేజీ తరువాయి...

చేసింది. ఆయనతో పాటు ఏ2గా ఉన్న ఐఏఎస్ అధికారి అర్వింద్‌కుమార్, ఏ3 హెచ్‌ఎండీఏ మాజీ చీఫ్ ఇంజినీర్ బీఎల్ఎన్ రెడ్డి, ఏ4 స్పోర్ట్స్ కన్స్‌స్టలెంట్ కిరణ్ మల్లేశ్వర్‌రావుకు సమన్లు జారీ అయ్యాయి. జులై 31న విచారణకు రావాలని కోర్టు ఆదేశించింది. 2023లో నిర్వహించిన ఫార్ములా ఈ-కార్ రేసు కేసులో నిబంధనలకు విరుద్ధంగా విదేశీ సంస్థకు రూ.55 కోట్లు మళ్లించినట్లు ఏసీబీ అభియోగపత్రంలో పేర్కొంది. ఇప్పటికే ఈ కేసులో కేటీఆర్, అర్వింద్ కుమార్, బీఎల్ఎన్ రెడ్డిలతో సహా ఎఫ్‌ఈఓ సంస్థ ప్రతినిధులను ప్రశ్నించింది. ఫార్ములా-ఈ కారు రేసు నిర్వహణలో జరిగిన అక్రమాలపై ఏసీబీ ఇప్పటికే లోతైన దర్యాప్తు జరిపి అభియోగపత్రాన్ని దాఖలు చేసింది. ఈ కేసులో ఏ1గా కేటీఆర్, ఏ2గా మాజీ అధికారి అరవింద్ కుమార్, ఏ3గా బీఎల్ఎన్ రెడ్డిలను ఏసీబీ పేర్కొంది. వీరితో పాటు ఏ4గా స్పోర్ట్స్ కన్స్‌స్టలెంట్ కిరణ్ మల్లేశ్వర్ రావు, ఏ5గా ఎఫ్‌ఈఓ సంస్థపై కేసులు నమోదయ్యాయి. 2023లో హైదరాబాద్‌లో నిర్వహించిన ఫార్ములా-ఈ రేసు కోసం నిబంధనలకు విరుద్ధంగా విదేశీ సంస్థకు నిధులు మళ్లించారన్నదే ప్రధాన అభియోగం. హెచ్‌ఎండీఏ ఖాతా నుంచి సుమారు 55 కోట్ల రూపాయలను ఎఫ్‌ఈఓ సంస్థకు బదిలీ చేసినట్లు ఏసీబీ ప్రాథమికంగా గుర్తించింది. ముందస్తు అనుమతులు లేకుండానే ఇంత భారీ మొత్తాన్ని విదేశీ సంస్థకు ఎలా చెల్లించారన్న కోణంలో దర్యాప్తు కొనసాగుతోంది. ఇప్పటికే ఈ కేసులో కేటీఆర్, అరవింద్ కుమార్ సహా పలువురు ప్రతినిధులను ఏసీబీ అధికారులు ప్రశ్నించారు. తాజాగా ఏసీబీ కోర్టు ఈ కేసును విచారణకు స్వీకరించి సమన్లు జారీ చేయడంతో.. జూలై 31న కోర్టులో ఏం జరగబోతుందనేది ఇప్పుడు సర్వత్రా ఉత్కంఠ రేపుతోంది.



# రెండ్రోజులు వర్క్ ఫ్రం హోమ్, నో కార్ డే

మొదటి పేజీ తరువాయి...

పని (వర్క్ ఫ్రమ్ హోమ్) చేసే వెసులుబాటు కల్పించడం ఒకటి. దీనివల్ల రోజూ కార్యాలయాలకు వచ్చివెళ్లే ప్రయాణాలు తగ్గి, ఇంధన వినియోగం గణనీయంగా తగ్గుతుందని ప్రభుత్వం భావిస్తోంది. దీనికి తోడు, ప్రభుత్వ శాఖలు నిర్వహించే సమావేశాలలో 50 శాతం తప్పనిసరిగా ఆన్‌లైన్‌లోనే జరపాలని ఆదేశించింది. తద్వారా అనవసర ప్రయాణాలను పూర్తిగా నివారించవచ్చు. ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు దిల్లీ ప్రభుత్వం, మున్సిపల్ కార్పొరేషన్ ఆఫ్ ఢిల్లీ (ఎంసీడీ) కార్యాలయాల పనివేళల్లో మార్పులు చేయనున్నారు.

వ్యయ నియంత్రణలో భాగంగా మరిన్ని కఠిన నిర్ణయాలు కూడా తీసుకున్నారు. అధికారులకు కేటాయించే అధికారిక వాహనాల నెలవారీ పెట్రోల్ పరిమితిపై 20 శాతం కోత విధించారు. అలాగే, రాబోయే ఆరు నెలల పాటు ప్రభుత్వ అవసరాలకు ఎలాంటి కొత్త వాహనాలను కొనుగోలు చేయరాదని స్పష్టం చేశారు. పర్యావరణ స్పృహ, వ్యక్తిగత బాధ్యతను పెంపొందించేందుకు ప్రభుత్వ ఉద్యోగులంతా వారానికి ఒకరోజు 'నో-కార్ డే' పాటించాలని ఆదేశాలు జారీ అయ్యాయి. సాధారణ ప్రజలు కూడా దీన్ని స్వచ్ఛందంగా పాటించాలని ప్రభుత్వం విజ్ఞప్తి చేసింది.

ప్రజా రవాణాను ప్రోత్సహించడం కూడా ఈ చర్యలలో కీలక భాగం. ఉద్యోగులు, ప్రజలు మెట్రో రైళ్లను ఎక్కువగా ఉపయోగించుకునేలా 'మెట్రో డే'ను నిర్వహించనున్నారు. అంతేకాకుండా, 29 ప్రభుత్వ ఉద్యోగుల నివాస కాలనీల నుంచి కార్యాలయాలకు రాకపోకలు సాగించేందుకు 58 ప్రత్యేక బస్సులను నడపనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది.

ప్రపంచవ్యాప్తంగా ఇంధన ధరలు పెరగడం, ఇరాన్ సంక్షోభం, హార్ముజ్ జలసంధిలో నెలకొన్న ఉద్రిక్తతల కారణంగా భారత్ వంటి దేశాలపై ఆర్థిక భారం పడుతోంది. ఈ నేపథ్యంలో ప్రధాని మోదీ ఇంధన వాడకాన్ని తగ్గించుకోవడం, బంగారం కొనుగోళ్లను వాయిదా వేయడం, అనవసర విదేశీ ప్రయాణాలు నివారించడం వంటి ఏడు సూత్రాలను ప్రజల ముందుంచారు. దిల్లీ ప్రభుత్వం తీసుకున్న ఈ చర్యలు 'ఆంక్షలు' కాదని, 'ఆర్థిక దేశభక్తి'ని చాటే 'వివేకవంతమైన వినియోగం' అని ప్రభుత్వ వర్గాలు స్పష్టం చేశాయి. త్వరలోనే ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించేందుకు ప్రత్యేక ప్రచార కార్యక్రమాన్ని కూడా ప్రారంభించనున్నారు.

# కరీంనగర్ జ్యువెలరీ దోపిడీ మిస్టరీ వీడింది!

మొదటి పేజీ తరువాయి...

112 క్యారెట్ల వజ్రాలను దోచుకెళ్లారు. ఈ దోపిడీకి ప్రధాన సూత్రధారి సుబోధ్ సింగ్ అని, ప్రస్తుతం అతను బీహార్‌లోని పూర్నియా జైలులో ఉంటూనే ఈ మొత్తం కుట్రకు పథక రచన చేశాడని కమిషనర్ తెలిపారు. సుబోధ్ సింగ్ ముఠాకు బీహార్, పశ్చిమ బెంగాల్, ఝార్ఖండ్, మహారాష్ట్ర, గుజరాత్, ఉత్తరాఖండ్ రాష్ట్రాల్లో దోపిడీలు చేసిన చరిత్ర ఉందని, ఇంత పకడ్బందీగా తెలంగాణలో దోపిడీ చేయడం ఇదే మొదటిసారని ఆయన పేర్కొన్నారు.

ఈ కేసులో దోపిడీకి నాయకత్వం వహించిన పశ్చిమ బెంగాల్ వాసి రఘునాథ్ కర్మకార్‌ను, అలాగే రవిష్ కుమార్, మెహతాబ్ ఖాన్‌లను బెంగాల్, బీహార్ రాష్ట్రాల్లో అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు. అరెస్టయిన వారిలో ఇద్దరు షూటర్లు కాగా, మరొకరు వారికి సహాయం అందించిన వ్యక్తి. దోపిడీకి రెండు నెలల ముందే నిందితులు ఖమ్మం, మంచిర్యాల, పెద్దపల్లి, జగిత్యాల వంటి ప్రాంతాల్లో రెక్కీ నిర్వహించి, చివరకు కరీంనగర్‌ను ఎంచుకున్నట్లు దర్యాప్తులో తేలింది. దోపిడీ అనంతరం బైక్‌లపై ధర్మపురికి చేరుకుని, అక్కడి నుంచి మూడు బృందాలుగా విడిపోయి రైళ్లు, బస్సుల ద్వారా పరారయ్యారు.

నిందితుల నుంచి రూ. 51,000 నగదు, రెండు మొబైల్ ఫోన్లు, రెండు సిమ్ కార్డులు, నకిలీ ఆధార్ కార్డులను స్వాధీనం చేసుకున్నారు. దర్యాప్తు కొనసాగుతున్నందున పరారీలో ఉన్న నిందితుల వివరాలు వెల్లడించలేమని కమిషనర్ తెలిపారు. మిగిలిన వారిని పట్టుకునేందుకు వివిధ రాష్ట్రాల్లో ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయని, అలాగే జైలులో ఉన్న సుబోధ్ సింగ్‌ను విచారించేందుకు కోర్టు అనుమతి కోరతామని ఆయన వివరించారు.

# శబరిమల కేసులో తీర్పు రిజర్వ్ చేసిన సుప్రీంకోర్టు

మొదటి పేజీ తరువాయి...

సీనియర్ న్యాయవాదులు సి.ఎస్. వైద్యనాథన్, అభిషేక్ సింఘ్వి, ముకుల్ రోహత్గీ, ఇందిరా జైసింగ్‌ల వాదనలను ధర్మాసనం పరిగణనలోకి తీసుకుంది.

విచారణకు ముందు శబరిమల ఆలయంలోకి రుతుక్రమం వయస్సున్న మహిళల ప్రవేశంపై ఉన్న నిషేధాన్ని సమర్థించాలని కేంద్రం లిఖితపూర్వకంగా విజ్ఞప్తి చేసింది. ఈ అంశం పూర్తిగా మత విశ్వాసాలకు సంబంధించినది అయినందున న్యాయసమీక్ష పరిధిలోకి రాదని పేర్కొంది. 2018 సెప్టెంబర్‌లో ఐదుగురు న్యాయమూర్తుల ధర్మాసనం 4:1 మెజారిటీతో శబరిమల ఆలయంలోకి మహిళల ప్రవేశంపై ఉన్న నిషేధాన్ని ఎత్తివేసింది. 10 నుంచి 50 ఏళ్ల మధ్య వయస్సు గల మహిళలు శబరిమల ఆలయంలోకి ప్రవేశించకుండా ఉన్న నిషేధాన్ని రద్దు చేసింది. శతాబ్దాలుగా కొనసాగుతున్న ఆ ఆచారం రాజ్యాంగ విరుద్ధమని పేర్కొంది.

అయితే ఈ అంశంపై పలు రివ్యూ పిటిషన్లు దాఖలయ్యాయి. దీంతో 2019 నవంబర్‌లో అప్పటి సీజేఐ రంజన్ గొగోయ్ నేతృత్వంలోని బెంచ్ ఈ వివాదంతోపాటు ఇతర మతాల్లో మహిళలపై వివక్షకు సంబంధించిన అంశాలను 9మంది సభ్యులతో కూడిన ధర్మాసనానికి బదిలీ చేసింది. శబరిమలతో పాటు ముస్లిం మహిళలకు మసీదులు, దర్గాల్లో ప్రవేశం, పార్సీ మహిళలు అగియారీలోకి ప్రవేశించడం వంటి అంశాలను కూడా ధర్మసనానికి అప్పగించింది. 2020 మే 11న సుప్రీం కీలక నిర్ణయం తీసుకుంది. శబరిమల కేసులో చట్టపరమైన ప్రశ్నలను విచారణ కోసం విస్తృత ధర్మాసనానికి నివేదించే అధికారం తమ ఐదుగురు న్యాయమూర్తుల ధర్మాసనానికి ఉందని పేర్కొంది. ఈ కేసులో తుది విచారణ ఏప్రిల్ 7 నుంచి ప్రారంభమవుతుందని, అలాగే, ఏప్రిల్ 22న ముగుస్తుందని సుప్రీం చెప్పుకొచ్చింది.

ఇదిలా ఉండగా, కొద్ది రోజుల క్రితం, శబరిమల ఆలయంలో మహిళల ప్రవేశ హక్కు సంబంధించి న్యాయస్థానం కీలక వ్యాఖ్యలు చేసింది. ఆలయంలో మహిళల ప్రవేశ హక్కును కోరుతూ ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు అయ్యింది. అయితే, ఆ విషయంపై సుప్రీంకోర్టు అసహనం వ్యక్తం చేస్తూ, అసలు పిటిషన్ ఎందుకు దాఖలు చేశారని ప్రశ్నించింది. దానికి సమాధానంగా 1990లో కేరళ హైకోర్టులో తంత్రి (ప్రధాన పూజారి) అఫిడవిట్ దాఖలు చేసినట్లు వెల్లడించిన పలు పత్రికా కథనాల ద్వారా ఈ పిల్ వేసినట్లు పిటిషనర్ తరఫు న్యాయవాది తెలిపారు.

దేశంలో ఎన్నో సమస్యలు ఉండగా, పిటిషనర్ ఈ విషయంపైనే ఎందుకు అంత ఆసక్తి చూపుతున్నారని జస్టిస్ నాగరత్న ప్రశ్నించారు. అసలు శబరిమల ఆలయంతో మీకేం సంబంధముందని పిటిషనర్‌ను ప్రశ్నించారు. లాయర్స్ అసోసియేషన్, బార్ సంక్షేమం, దేశం కోసం పని చేయకుండా ఇటువంటి విషయాలపై ఎందుకు ఉత్సుకత చూపుతోందని అన్నారు. దీనికంటే న్యాయం కోసం గ్రామాల నుంచి వచ్చే పేదల కోసం పని చేయాలని సూచించారు. పత్రికా కథనాల ఆధారంగా దాఖలు చేసిన పిటిషన్‌లను ముందే కొట్టివేయాల్సిందన్నారు. దీనిపై విచారణ జరపడం సరికాదని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ అభిప్రాయపడ్డారు. ఇటువంటి కేసులు పెట్టి కోర్టును ఇబ్బంది పెట్టొద్దని ధర్మాసనం పేర్కొంది. ఇది న్యాయ ప్రక్రియను దుర్వినియోగం చేయడమే అవుతుందని పిటిషనర్‌ను హెచ్చరించింది.

# 16 రాష్ట్రాలు, 3 కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఎస్ఐఆర్ మూడో దశ

మొదటి పేజీ తరువాయి...

మిజోరం, సిక్కిం, మణిపూర్, ఉత్తరాఖండ్, ఆంధ్రప్రదేశ్, అరుణాచల్ ప్రదేశ్, హరియాణా, చండీగఢ్, తెలంగాణ, పంజాబ్, కర్ణాటక, మేఘాలయ, మహారాష్ట్ర, ఝార్ఖండ్, నాగాలాండ్, త్రిపుర, దాద్రానగర్ హవేలి, డామన్ దయ్యూలో మూడో దశ ఎస్ఐఆర్ ప్రక్రియ జరగనుంది. అయితే, మంచు ప్రభావిత ప్రాంతాలైన హిమాచల్ ప్రదేశ్, జమ్ము కశ్మీర్, లద్ధాఖ్ ప్రాంతాల్లో వాతావరణాన్ని దృష్టిలో ఉంచుకుని ఎస్ఐఆర్ షెడ్యూల్‌ను తర్వాత ప్రకటిస్తామని పేర్కొంది.



### మూడో దశలో దాదాపు 36.73 కోట్ల మంది ఓటర్ల వివరాల పరిశీలన

ఎస్ఐఆర్ మూడో దశలో భాగంగా 3.94 లక్షల మందికి పైగా బూత్ స్థాయి అధికారులు (బీఎల్ఓ)లు ఇంటింటికీ వెళ్లి దాదాపు 36.73 కోట్ల మంది ఓటర్ల వివరాలను పరిశీలించనున్నారు. వీరికి రాజకీయ పార్టీలు నియమించిన 3.42 లక్షల బూత్ లెవల్ ఏజెంట్లు (బీఎల్ఏ)లు సహకరించనున్నారు. అయితే, ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ పారదర్శకంగా ఉండేందుకు రాజకీయ పార్టీలు ప్రతి పోలింగ్ బూత్‌కు తప్పనిసరిగా బీఎల్ఏలను నియమించాలని ఎన్నికల సంఘం కోరింది.

### ఆంధ్రప్రదేశ్‌లో ఎప్పుడంటే!

మరోవైపు, మూడో దశ షెడ్యూల్‌ను రాష్ట్రాల వారీగా ఎన్నికల సంఘం ప్రకటించింది. ఆంధ్రప్రదేశ్, అరుణాచల్ ప్రదేశ్, హరియాణా, చండీగఢ్ ప్రాంతాల్లో జూన్ 15 నుంచి జులై 14 వరకు బీఎల్ఓలు ఇంటింటిటి వెళ్లి ఓటర్ల వివరాలను పరిశీలించనున్నారు. అనంతరం జులై 21న ముసాయిదా జాబితా విడుదల చేస్తారు. ఆగస్టు 20 వరకు అభ్యంతరాలు స్వీకరించి, సెప్టెంబర్ 22న తుది జాబితా విడుదల చేయనున్నారు.

### తెలంగాణ విషయానికొస్తే!

ఇక, తెలంగాణ, పంజాబ్ రాష్ట్రాల్లో జూన్ 25 నుంచి జులై 24 వరకు బీఎల్ఓలు ఇంటింటికీ వెళ్లనున్నారు. జులై 31న ముసాయిదా జాబితా విడుదల చేసి, అక్టోబర్ 1న తుది జాబితా ప్రకటించనున్నారు. కర్ణాటక, మహారాష్ట్ర, దిల్లీ, ఝార్ఖండ్, మేఘాలయ రాష్ట్రాల్లో జూన్ 30 నుంచి జులై 29 వరకు పరిశీలన కొనసాగుతుంది. అక్టోబర్ 7న తుది ఓటరు జాబితా విడుదల కానుంది. అలాగే, నాగాలాండ్‌లో ఆగస్టు 16 నుంచి సెప్టెంబర్ 14 వరకు పరిశీలన ఉండగా, నవంబర్ 22న తుది జాబితా విడుదల చేస్తారు. త్రిపురలో సెప్టెంబర్ 15 నుంచి అక్టోబర్ 14 వరకు ఇంటింటి పరిశీలన జరగనుంది. డిసెంబర్ 23న తుది జాబితా విడుదల చేయనున్నారు.

ఒడిశా, మిజోరం, సిక్కిం, మణిపూర్ రాష్ట్రాల్లో జూన్ 28 వరకు ఇంటింటికి వెళ్లి ఓటర్ల వివరాలను పరిశీలించనున్నారు. జులై 5న ముసాయిదా ఓటరు జాబితా విడుదల చేసి, ఆగస్టు 4 వరకు అభ్యంతరాలు స్వీకరించనున్నారు. అనంతరం తుది జాబితా సెప్టెంబర్ 6న విడుదల కానుంది. అదేవిధంగా, దాద్రా నగర్ హవేలీ, దామన్ అండ్ దయ్యూ కేంద్ర పాలిత ప్రాంతాల్లో జూన్ 4 నుంచి జూలై 3 వరకు బీఎల్ఓలు ఇంటింటిటిక వెళ్లి పరిశీలించున్నారు. అనంతరం ఓటర్ల తుది జాబితాను సెప్టెంబర్ 11న ప్రకటించనున్నారు. ఉత్తరాఖండ్‌లో జూన్ 8 నుంచి జులై 7 వరకు బీఎల్ఓల పరిశీలన జరిగి, సెప్టెంబర్ 15న తుది ఓటరు జాబితా విడుదల చేయనున్నారు.

### ఆ రాష్ట్రాల్లో ఎస్ఐఆర్ ప్రక్రియ కంప్లీట్!

కాగా, బిహార్, బంగాల్, తమిళనాడు, కేరళ, పుదుచ్చేరి, ఉత్తర్‌ప్రదేశ్, రాజస్థాన్, మధ్యప్రదేశ్, గుజరాత్, ఛత్తీస్‌గఢ్, గోవా, అండమాన్ నికోబార్ దీవులు, లక్షద్వీప్‌లలో ూ×= ప్రక్రియ ఇప్పటికే పూర్తయింది. ఇప్పటివరకు జరిగిన తొలి రెండు దశల్లో 13 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో దాదాపు 59 కోట్లకు పైగా ఓటర్ల వివరాలను సేకరించినట్లు ఈసీ పేర్కొంది. ఆ దశల్లో 6.3 లక్షల బీఎల్ఓలు, 9.2 లక్షల బీఎల్ఏలు పాల్గొన్నట్లు వెల్లడించింది.

# అత్తాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆధ్వర్యంలో బడి బాట








బడి బాట లో పాల్గొన్న ఉపాధ్యాయులు

**బుద్వేల్, మే 14 (నమస్తే ఉదయం)**

విద్యా వారోత్సవాలలో బాగంగా అత్తాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆధ్వర్యంలో గురువారం బడి బాట నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీలత ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలో విద్యాబోధన జరుగుతుందని, అన్ని మౌలిక వసతులు కూడా ఉన్నాయని, తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించాలన్నారు. అర్హులైన ఉపాధ్యాయులచే విద్యాబోధన చేయడం జరుగుతుందన్నారు. ప్రతి ప్రభుత్వ, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇంగ్లీషు మీడియం కూడా ఉందని గుర్తు చేశారు. ఇంటింటికి వెళ్లి కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పీఆర్టీయు రాజేంద్రనగర్ మండల ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ సాగర్, ఉపాధ్యాయులు రజియాబేగం, సాయి ప్రసాద్ రావు, రంగారెడ్డి, సుజాత, రోజా రాణి, జ్యోతి, హేమలత, పద్మావతి, సురేశ్, కమలమ్మ, అనిత, కృష్ణవేణి, కవిత, పాఠశాల ఏఏపీసీ చైర్మన్ వాణి తదితరులు పాల్గొన్నారు.




భారతీయ వరి పరిశోధన సంస్థలో నేల పరీక్షలు అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న రైతులు

## నేల పరీక్షల ఆదారంగా ఎరువులను వేయాలి

**బుద్వేల్, మే 14 (నమస్తే ఉదయం)**

నేల పరీక్షల ఆధారంగా ఎరువుల వినియోగం చేపట్టాలని రాజేం ద్రనగర్ లోని భారతీయ వరి పరిశోధన సంస్థ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ బ్రజేంద్ర అన్నారు. మేరా గావ్ మేరా గౌరవ్ కార్యక్రమంలో బాగంగా గురువారం రాజేంద్రనగర్ లోని భారతీయ వరి పరిశోధన సంస్థ (ఐఐఆర్ఆర్) లో వికారాబాద్, మొయినాబాద్ ప్రాంతాలకు చెందిన రైతులకు సమతుల్య ఎరువుల వినియోగం, నేల ఆరోగ్య పరిరక్షణ, అధునిక వ్యవసాయ పద్దతులపై అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తమిళనాడు రాష్ట్రంలోని తిరుచిరాపల్లి వ్యవసాయ శాఖ సహాయ సం చాలకులు జి మరియప్పన్ హాజరయ్యారు. వ్యవసాయం లో అధిక దిగుబడులు రావాలంటే నేల ఆరోగ్య పరీక్షలు తప్పనిసరి అన్నారు. నేల ఆరోగ్య పరీక్షల ఆధారంగా ఎరువులు వేసినట్లయితే మంచి పంటలు పండుతాయన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయశాఖ అధికారులు, రైతులు పాల్గొన్నారు.







సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి ప్రకాష్ గౌడ్.
చిత్రంలో రాజేంద్రనగర్ జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి తదితరులు

## అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రజలు ఇబ్బందులు పడకుండ చూడాలి: ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్

**బుద్వేల్, మే 14 (నమస్తే ఉదయం)**

జీహెచ్ఎంసీ లో విలీనమైన ప్రాంతాల తో పాటు పాత మున్సిపల్ సర్కిళ్లలో ప్రజలెదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటిని త్వరితగతిన పూర్తి చేయాలని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి ప్రకాశ్ గౌడ్ అన్నారు. బుద్వేల్ లోని రాజేంద్రనగర్ జోనల్ కార్యాలయంలో జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షతన గురువారం నియోజకవర్గ స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. బండ్లగూడ పరిసర కాలనీలు, బస్తీలలో నీటి సమస్య తీవ్రంగా ఉందని, వేసవి లో ప్రజలు ఇబ్బందులు పడకుండ జలమండలి అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ సూచనలు చేశారు. వేసవి లో తాగు నీటి సమస్యలు లేకుండ చూడాలన్నారు. జీహెచ్ఎంసీ లో విలీనమైన ప్రాంతాలలో ఎలాంటి పనులు చేయడం లేదని, కావాల్సిన అభివృద్ధి పనుల ప్రతిపాధనలు తయారు చేసి త్వరగా పనులు చేసేటట్లు చూడాలన్నారు. రాజేంద్రనగర్, అత్తాపూర్ సర్కిళ్లలో చాలా చోట్ల విద్యుత్ స్థంబాలు విరిగిపోయాయని, కొన్ని కాలనీలలో అసలు విద్యుత్ స్థంబాలే ఏర్పాటు చేయలేదని, అలాంటి ప్రాంతాలను గుర్తించి విద్యుత్ స్థంబాలు ఏర్పాటు చేసి ప్రజల ఇబ్బందులను తొలగిచాలన్నారు. రాజేంద్రనగర్ నియోజకవర్గంలో ప్రజలకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండ అధికారులు పనులు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, ఎక్కడెక్కడ సమస్యలు ఉన్నాయో వాటిని పరిష్కరించడానికి అంచనాలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. సమావేశంలో విద్యుత్ శాఖ రాజేంద్రనగర్ డీఈ పి రత్నాకర్ రావు, జలమండలి డైరెక్టర్ వినోద్ భార్గవ్, జీహెచ్ఎంసీ ఇంచార్జి ఎస్ఈ నరేందర్ గౌడ్, ఈఈ లు వెంకట శేషయ్య, జలమండలి జనరల్ మేనేజరు సాయిలక్ష్మీ, డీజీఎం జోహార్ అలీ, తో పాటు వివిధ శాఖల అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# ఘనంగా రాజేంద్రనగర్ పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షులు రెవరెండ్ సీ హెచ్ సునీల్ సామ్యూల్ జన్మదిన వేడుకలు



రెవరెండ్ సీ హెచ్ సునీల్ సామ్యూల్ ను సన్మానించి కేక్ కట్ చేయించిన పాస్టర్లు, నాయకులు

**బుద్వేల్, మే 14 (నమస్తే ఉదయం)**

రాజేంద్రనగర్ మండల పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షులు, దుర్గానగర్ ఎలోహిం గాస్పెల్ చర్చ్ పాస్టర్ రెవరెండ్ సీ హెచ్ సునీల్ సామ్యూల్ జన్మదిన వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. పాస్టర్స్ ఫెలోషిప్ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో రెవరెండ్ సీ హెచ్ సునీల్ సామ్యూల్ చేత కేక్ కట్ చేయించారు. శాలువా, పూలమాలలతో సన్మానించారు. రెవరెండ్ సీ హెచ్ సునీల్ సామ్యూల్ ను దేవుడు ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో, ఐ ష్టశ్వర్యాలతో దీవించాలని ప్రార్థన లు చేశారు. కార్యక్రమంలో ఫెలోషిప్ ఉ పాధ్యక్షులు రెవరెండ్ పి. ప్రమోద్ కుమార్, సంయుక్త కార్యదర్శి రెవరెండ్ సోమారం రాజ్ కుమార్, కోశాది కారి రెవరెండ్ బట్టు శ్రీకాంత్, కమిటీ సభ్యులు రెవరెండ్ జాజుల యేసు రత్నం, రెవరెండ్ గంటి డానియల్, బ్రదర్ జాన్, బ్రదర్ డానియల్ భీమయ్య, బ్రదర్ ఎలియాజర్ అభిషేక్, జాయ్ బ్లేస్సి లు పాల్గొన్నారు.



రెవరెండ్ సీ హెచ్ సునీల్ సామ్యూల్‌కు
కేక్ తినిపిస్తున్న రెవరెండ్ బట్టు శ్రీకాంత్



అవగాహన ఒప్పందం కార్యక్రమంలో పాల్గొన్న
వ్యవసాయ విశ్వవిద్యాలయం అధికారులు, ఆస్ట్రేలియా ప్రతినిధులు

## రైతులకు ఉపోయోగ పడే కార్యక్రమాలపై అవగాహన ఒప్పందాలు

**బుద్వేల్, మే 14 (నమస్తే ఉదయం):**

రైతులు వాతావరణ మార్పుల ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు భారత్ – అస్ట్రేలియా బాగస్వామ్యం ఎంతో అవసరమని భారత్ లో ఆస్ట్రేలియా హై కమిషనర్ ఫిలిప్ గ్రీన్ అన్నారు. రాజేంద్రనగర్ లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాయలం లో గురువారం భారత్ ఆస్ట్రేలియా స్మార్ట్ నెట్వర్క్ ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ కు చెందిన రీసెర్చ్ అండ్ ఇన్నోవేషన్ సర్కిల్ ఆఫ్ హైదరాబాద్ (రిచ్), చార్లెస్ స్టర్ట్ యూనివర్శిటీ (సీఎస్ యు), ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం (పీజేటీఏయు), బెంగుళూరు సైన్స్ అండ్ టెక్నాలజీ క్లస్టర్ (బెస్ట్) సీఓఈ ఎఫ్ పీఓ బెంగుళూరు సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. 3. ఈ కార్యక్రమం ద్వారా వాతావరణ అనుకూల వ్యవసాయం, డిజిటల్ వ్యవసాయ సాంకేతికతలు, ఫిషిషన్ ఫార్మింగ్, నవకల్పనలు, స్థిరమైన వ్యవసాయ విధానాలలో భారత్– ఆస్ట్రేలియా దేశాల మధ్య సహకారాన్ని మరింత బలోపేతం చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ వేదిక ద్వారా రెండు దేశాల విద్యాసంస్థలు, పరిశోధన సంస్థలు, స్టార్టప్ లు, పరిశ్రమలు, ఇతర బాగస్వామ్య సంస్థల మధ్య సంయుక్త పరిశోధనలు, పైలట్ ప్రాజెక్టులు, సాంకేతిక పరిజ్ఞాన మార్పిడి నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వ్యవసాయ వర్శిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య తెలిపారు. ఈ కార్యక్రమ ంలో వ్యవసాయ వర్శిటీ రిజిస్ట్రార్ డాక్టర్ విద్యాసాగర్, పరిశోధన సంచాలకులు డాక్టర్ ఎం బలరాం, ఆస్ట్రేలియా కాన్సులేట్ జనరల్ హిల్లరీ మళ్లీచీ, బెంగుళూరు సైన్స్ టెక్నాలజీ క్లస్టర్ సీఈఓ అనంత రామన్, దీప్తి సునీల్, రామలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.



## పటాన్‌చెరు నియోజకవర్గ అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందించండి

### సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్‌ను కోరిన ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

**పటాన్ చెరు,మే 14 (నమస్తే ఉదయం):**

పటాన్ చెరు నియోజకవర్గ అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందించాలని సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ను పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి కోరారు.గురువారం సాయంత్రం సంగారెడ్డి లోని కలెక్టర్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వివిధ అంశాలపై చర్చించారు. ప్రధానంగా 2025-2026 సంవత్సరానికి సంబంధించిన స్పెషల్ డెవలప్మెంట్ ఫండ్ ద్వారా చేపట్టబోయే అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. అమీన్పూర్ డివిజన్ పరిధిలోని వడకపల్లి కోట అభివృద్ధి కోసం హెచ్ఎండిఏ అధికారులతో చర్చించడం జరిగిందని.. రెవెన్యూ శాఖ తరపున ఎన్ఓసి జారీ చేయాలని కోరారు. హెచ్ఎండిఏ నిధులతో కోటను పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దుతున్నట్లు తెలిపారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన కలెక్టర్ ప్రజోపయోగ కార్యక్రమాలకు ఎల్లప్పుడూ సంపూర్ణ సహకారం అందిస్తామని హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే జిఎంఆర్ తెలిపారు. ఈ సమావేశంలో అమీన్పూర్ మాజీ జెడ్పిటిసి సుధాకర్ రెడ్డి పాల్గొన్నారు.

## ఢిల్లీ మద్యం కేసు సామాజిక మాధ్యమాల్లో దుష్ప్రచారం

### తీవ్రంగా పరిగణించిన ఢిల్లీ హైకోర్టు

**హైదరాబాద్,మే 14 (నమస్తే ఉదయం):**

ఢిల్లీ మద్యం విధానం కేసుకు సంబంధించి న్యాయవ్యవస్థపై సామాజిక మాధ్యమాల్లో జరుగుతున్న దుష్ప్రచారాన్ని ఢిల్లీ హైకోర్టు తీవ్రంగా పరిగణించింది. న్యాయమూర్తులను, కోర్టు విచారణలను కించపరిచేలా వ్యవహరిస్తున్నారంటూ ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్) అధినేత అరవింద్ కేజ్రీవాల్ సహా పలువురు ఆప్ నేతలపై కోర్టు ధిక్కార చర్యలకు ఉపక్రమించింది. ఈ మేరకు జస్టిస్ స్వర్ణకాంత శర్మ గురువారం కీలక ఉత్తర్వులు జారీ చేశారు. న్యాయపరమైన అంశాలను కోర్టులో ఎదుర్కోవాల్సింది పోయి, వాటిని సోషల్ మీడియా వేదికగా ప్రజల్లోకి తీసుకెళ్లి.. న్యాయవ్యవస్థపై వ్యతిరేకతను పెంచేలా ప్రచారం చేస్తున్నారని కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. తనపై, న్యాయస్థానంపై అత్యంత హేయమైన, కోర్టు ధిక్కారపూరితమైన అంశాలను ఉద్దేశపూర్వకంగా ప్రచారం చేస్తున్నారని జస్టిస్ స్వర్ణకాంత శర్మ పేర్కొన్నారు. కేజ్రీవాల్ ఈ న్యాయ వివాదాన్ని ఓ బహిరంగ ప్రచారంగా మార్చేశారన్న ఆమె.. ఇది న్యాయ పక్రియను అగౌరవపరచడమేనని అభిప్రాయపడ్డారు. గతంలో తాను ఒక కళాశాల కార్యక్రమంలో ప్రసంగించిన ఓ వీడియోను ప్రస్తుత కేసుకు ముడిపెడుతూ, అసందర్భంగా సోషల్ మీడియాలో వైరల్ చేయడాన్ని న్యాయమూర్తి తప్పుపట్టారు. ఇలాంటి చర్యలు ప్రజల్లో న్యాయవ్యవస్థ పట్ల తప్పుడు అభిప్రాయాన్ని కలిగిస్తాయని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. న్యాయవ్యవస్థ ప్రతిష్ఠను దిగజార్చేలా సాగుతున్న ఈ దుష్ప్రచారాన్ని ఉపేక్షించే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ఈ మేరకు కేజ్రీవాల్‌తో పాటు ఆప్ ఎంపీ సంజయ్ సింగ్, పార్టీ నేతలు వినయ్ మిశ్రా, సౌరభ్ భరద్వాజ్‌లకు కూడా కోర్టు ధిక్కార నోటీసులు జారీ అయ్యాయి. న్యాయవ్యవస్థపై బురదజల్లేలా వ్యవహరించినందుకు సమాధానం ఇవ్వాలని ఆదేశించింది న్యాయస్థానం. రాజకీయ పోరాటాలు ప్రజాక్షేత్రంలో జరగాలని, కానీ న్యాయస్థానాల తీర్పులను, న్యాయమూర్తుల వ్యక్తిత్వాన్ని కించపరిచేలా సామాజిక మాధ్యమాలను వాడుకోవడం ప్రజాస్వామ్యానికి చేటు చేస్తుందని ఈ సందర్భంగా కోర్టు హెచ్చరించింది. కాగా.. మద్యం పాలసీ కేసులో ఇప్పటికే రాజకీయ ప్రకంపనలు కొనసాగుతుండగా, తాజాగా హైకోర్టు తీసుకున్న ఈ ధిక్కార చర్యల నిర్ణయం దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది.

# సింగరేణిలో మహిళా డంపర్ ఆపరేటర్ల నియామకం

**తొలిసారిగా భారీ డంపర్లను నడపనున్న మహిళా కార్మికులు... మహిళా శక్తికి ప్రాధాన్యత ఇవ్వాలన్న ఆదేశంపై స్పందించిన సింగరేణి**

**వివిధ క్లిష్టతర బాధ్యతల నిర్వహణపై మహిళలకు అవకాశాలు.. హెవీ మోటార్ వెహికిల్ శిక్షణను పూర్తి చేసిన 13 మంది మహిళా ఉద్యోగులు**

**హైదరాబాద్, మే14 (నమస్తే ఉదయం)**

మహిళాభివృద్ధికి అధిక ప్రాధాన్యనిస్తున్న తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సింగరేణి సంస్థలో కూడా మహిళా శక్తికి తగు ప్రాధాన్యతనిచ్చి ప్రోత్సహించాలని ఆదేశించడంతో సింగరేణి చరిత్రలో తొలిసారిగా భారీ డంపర్ల ఆపరేటర్లుగా కొందరు మహిళలకు కంపెనీ అవకాశం కల్పించేందుకు చర్యలు చేపట్టింది. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆదేశంపై సింగరేణి యాజమాన్యం మహిళా డంపర్ ఆపరేటర్ల నియామకానికి శ్రీకారం చుట్టింది. ఓపెన్ కాస్ట్ గనుల్లో బొగ్గు, ఓవర్ బర్డెన్ ను గని క్వారీ నుండి ఉపరితలానికి రవాణా చేయడానికి యాజమాన్యం 60 నుంచి 100 టన్నుల భారీ డంపర్లను వినియోగిస్తుంది. సింగరేణిలో గత 50 ఏళ్లుగా నిర్వహిస్తున్న ఓపెన్ కాస్ట్ గనుల్లో ఇప్పటివరకు కేవలం మగ ఆపరేటర్లు మాత్రమే ఈ భారీ డంపర్ లను నడుపుతూ వస్తున్నారు. ఎందుకంటే ఈ డంపర్లను నడపడం కొంత కష్టంతో పాటు శారీరక దృఢత్వం, డ్రైవింగ్ నైపుణ్యం అవసరమై ఉంటాయి, పైగా మండే ఎండల్లోనూ, భారీ వర్షాలు, తీవ్రమైన చలి పరిస్థితులను తట్టుకొని మూడు షిఫ్టుల్లో కూడా డంపర్లు నడపాల్సి ఉంటుంది. ఇంత కష్టతరమైన పనిని పురుష ఆపరేటర్లు మాత్రమే నిర్వహిస్తూ వస్తున్నారు. అయితే సింగరేణి సంస్థలో ఇటీవల మహిళా ఉద్యోగుల సంఖ్య క్రమంగా పెరుగుతూ వచ్చింది. మహిళా శక్తిని సద్వినియోగం చేసుకోవాలని, వారి నైపుణ్యాలను, శక్తి సామర్థ్యాలను కూడా వినియోగించడానికి తగు ప్రాధాన్యత కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వం సింగరేణిని ఆదేశించింది. ఈ నేపథ్యంలో సింగరేణి సంస్థ ఓపెన్ కాస్ట్ గనుల్లో డంపర్ ఆపరేటర్లుగా పని చేయడానికి ఆసక్తి గల మహిళా ఉద్యోగుల నుంచి దరఖాస్తులను కోరింది. మొదట దాదాపు 35 మంది వరకు ముందుకు వచ్చారు. అయితే భారీ డంపర్లను నడపడానికి వారికి అంతకుముందే సాధారణ డ్రైవింగ్ లైసెన్స్ తో పాటు భారీ వాహనాలను నడిపే లైసెన్స్ కూడా అవసరమై ఉన్నాయి. దీనిని దృష్టిలో ఉంచుకున్న యాజమాన్యం సిరిసిల్లలో ఉన్న తెలంగాణ ఇనిస్టిట్యూట్ ఆఫ్ డ్రైవింగ్ ఎడ్యుకేషన్ అండ్ స్కిల్స్ (టైడ్స్)అనే సంస్థ ద్వారా ఆసక్తి గల మహిళలకు కంపెనీ ఖర్చులతో భారీ వాహనాలపై ఉచిత డ్రైవింగ్ శిక్షణను అందించింది. ఃక్షణను విజయవంతంగా పూర్తి చేసుకున్న 13 మంది మహిళా ఉద్యోగులు తాము డంపర్ ఆపరేటర్లుగా పనిచేయటానికి సంసిద్ధంగా ఉన్నామని కంపెనీకి తెలిపారు. శిక్షణ పూర్తి చేసుకున్న వీరందరికీ త్వరలో విడుదలయ్యే డంపర్ ఆపరేటర్ల నియామకల్లో అవకాశం కల్పించనున్నట్లు యాజమాన్యం తెలిపింది. రాష్ట్ర ప్రభుత్వం మహిళా సాధికారతపై ప్రత్యేక దృష్టి సారించిన నేపథ్యంలో సింగరేణి సంస్థ కూడా ఆ దిశగా కీలక అడుగులు వేస్తోంది. పురుషులకు మాత్రమే పరిమితమైన కఠినమైన పనుల్లో మహిళలకు సైతం ప్రాధాన్యతనిస్తూ సింగరేణి సంస్థ తొలిసారిగా డంపర్ ఆపరేటర్లుగా మహిళలకు కూడా అవకాశం కల్పించటానికి విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టింది, ఈ విధంగా అనతి కాలంలోనే సింగరేణి సంస్థలో భారీ డంపర్లపై మహిళా ఉద్యోగులు పెద్ద సంఖ్యలో కనపడే అవకాశం ఉంది. సందర్భంగా కొందరు మహిళా ఆపరేటర్లు మాట్లాడుతూ, భారీ డంపర్లను నడపడం శారీరక కష్టం, నైపుణ్యంతో కూడుకున్న పని అని, తాము చేయగలమో లేదో అని కొంత భయపడినప్పటికీ, స్వయంగా డంపర్లు నడుపుతున్నప్పుడు తాము కూడా ఇటువంటి పనులు చేయగమన్న ఆత్మవిశ్వాసం కలగిందన్నారు. నేటి ఆధునిక కాలంలో మహిళలు అన్ని రంగాలతో పాటు రోదసిలోకి వెళ్తున్నారని కనుక గనిలోని డంపర్లను మహిళలు నడపడం అంత కష్టమేమీ కాదని, ఇటువంటి మంచి అవకాశాన్ని కల్పించిన రాష్ట్ర ప్రభుత్వానికి, సింగరేణి యాజమాన్యానికి తాము ధన్యవాదాలు తెలుపుతున్నట్లు వారు పేర్కొన్నారు. సందర్భంగా అధికారులు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు శ్రీ ఎ. రేవంత్ రెడ్డి, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రివర్యులు, ఇంధన శాఖామాత్యులు శ్రీ భట్టి విక్రమార్క మల్లు ల ఆదేశాల మేరకు సింగరేణిలో మహిళా శక్తికి తగిన అవకాశాలు కల్పిస్తూ వస్తున్నామని, బెల్లంపల్లి ఖైరీగూడ ఓపెన్ కాస్ట్ గనిలో అత్యంత క్లిష్టమైన బ్లాస్టింగ్ విభాగంలో కూడా కేవలం మహిళలను మాత్రమే నియమించగా వారు పురుష ఉద్యోగులతో సమానంగా బ్లాస్టింగ్ ను నిర్వహిస్తున్నారని, అలాగే ఇతర విభాగాల్లో కూడా మహిళలు రాణిస్తున్నారని ఒక అధికారి పేర్కొన్నారు. సంస్థ చరిత్రలో తొలిసారిగా మహిళా రెస్క్యూ జట్టును కూడా ఏర్పాటు చేశామన్నారు. ఇలాగే ఇకపై కూడా వివిధ క్లిష్టతరమైన ఉద్యోగాలలో ఆసక్తి గల మహిళలకు పురుషులతో సమానంగా అవకాశాలు ఇవ్వడం జరుగుతుందని అధికారులు పేర్కొంటున్నారు.



## గద్వాలలో కొనసాగుతున్న ఫుట్‌పాత్ ఆక్రమణల తొలగింపు

**నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు**

**గద్వాల జిల్లా ప్రతినిధి మే 4 (నమస్తే ఉదయం)**

గద్వాల మున్సిపాలిటి పరిధిలో ఫుట్‌పాత్ ఆక్రమణల తొలగింపు పరంపర గురువారం మూడో రోజు కొనసాగింది. ఈ సందర్భంగా భీంనగర్ లో గద్వాల మున్సిపల్ చైర్ పర్సన్ తుమ్మల నరసింహులు యాదవ్, మున్సిపల్ కమీషనర్ జానకీరాం సాగర్ అక్రమణల తొలగింపు ప్రాంతాలలో పర్యటించి పరిశీలించారు. మార్కింగ్ ఎక్కడి వరకు వేశారో అక్కడి వరకు తొలగించాలని మున్సిపల్ సిబ్బందికి సూచించారు. ఫుట్‌పాత్ పై ఆక్రమణల తొలగింపు సందర్భంగా పేర్కొన్న చెత్త ఇతర వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించాలని సూచించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ట్రాఫిక్ అంతరాయం కలగడంతో పాటు పాదచారులకు అసౌకర్యంగా మారడంతో ఫుట్‌పాత్ ఆక్రమణలను అధికారులు తొలగిస్తున్నారు. ఈ మేరకు భీంనగర్ లో రోడ్డుకు ఇరువైపులా ఫుట్‌పాత్ పై ఏర్పాటు చేసిన చిరు వ్యాపారాలు ఇతర దుకాణాలను తొలగించినట్లు సూచించారు. తొలగించిన ప్రాంతాల్లో మళ్లీ దుకాణాలు ఏర్పాటు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని వారు హెచ్చరించారు. శాంతి భద్రతలు, ట్రాఫిక్ పట్టణ ప్రణాళిక విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో తొలగింపులను చేపడుతున్నట్లు స్పష్టం చేశారు. స్పెషల్ డ్రైవ్ నిరంతరం కొనసాగుతుందన్నారు.

## ట్యాంకర్ తొక్కి వ్యక్తి దుర్మరణం

**పటాన్ చెరు, మే 14( నమస్తే ఉదయం):**



నిర్లక్ష్యంగా వాహనం నడపడం వల్ల ఓ వ్యక్తి దుర్మరణం చెందిన ఘటన బొల్లారం డివిజన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కిష్టాయిపల్లి లో చోటుచేసుకుంది. గడ్డపోతారం మున్సిపల్ పరిధిలోని కిష్టాయిపల్లి కి చెందిన మంగలి ప్రవీణ్ అనే వ్యక్తి నిద్రిస్తున్న సమయంలో వెనక నుంచి ట్యాంకర్ తొక్కడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ట్యాంకర్ డ్రైవర్ నిర్లక్ష్యమే ప్రమాదానికి కారణమని తెలుస్తోంది. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు బొల్లారం పోలీస్ ఇన్స్పెక్టర్ ఎం రవీందర్ రెడ్డి తెలిపారు.

## పొదుపు మంత్రంపై మహా సిఎం వినూత్న ప్రయోగం

**రాయల్ ఎన్‌ఫీల్డ్‌పై విధాన సభకు పయనం**

**ముంబై,మే మే14(నమస్తే ఉదయం)**

పశ్చిమాసియా సంక్షోభంతో ప్రధాని నరేంద్ర మోదీ పొదుపు మంత్రం పాటిస్తున్న సంగతి తెలిసిందే. పెట్రోల్, గ్యాస్, డీజిల్ వినియోగాన్ని తగ్గించాలని ఇటీవల భారతదేశ ప్రజలకు ప్రధాని పిలుపునిచ్చారు. ఎన్డీయే పాలిత రాష్ట్రాలు మోదీ పిలుపును ఆహ్వానించాయి. ఈ మేరకు ముఖ్యమంత్రులు, మంత్రులు తమ కాన్వాయ్‌ల సంఖ్యను తగ్గించుకుంటున్నారు. ఈ నేపథ్యంలో మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ ఒక అడుగు ముందుకేసి సంచలన నిర్ణయం తీసుకున్నారు. తన కార్ల కాన్వాయ్‌కి బదులుగా ద్విచక్రవాహనాలను ఎంచుకున్నారు. గురువారం మహారాష్ట్ర శాసన మండలికి కొత్తగా ఎన్నికైన సభ్యుల ప్రమాణ స్వీకారోత్సవం జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరయ్యేందుకు ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ ద్విచక్రవాహనంపై బయలుదేరారు. తన అధికారిక నివాసం నుంచి రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్‌పై విధాన భవన్‌కు వెళ్లారు. సీఎంతో పాటు మంత్రి ఆశిష్ షెలార్, భద్రతా సిబ్బంది కూడా ద్విచక్రవాహనాలపై శాసన మండలికి చేరుకున్నారు. దీనికి సంబంధించిన ఫొటోలు, వీడియోలను ఎక్స్ వేదికగా ఫడ్నవీస్ పోస్టు చేశారు. 'ప్రధాని మోదీ పిలుపు మేరకు పొదుపు చర్యల్లో భాగంగా దేశం కోసం ఇది నా వంతు సహకారం. ప్రతి ఒక్కరూ దేశం కోసం తమ జీవనశైలిలో మార్పులు చేసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నా' అంటూ ఆయన పోస్టు చేశారు. కాగా, ప్రపంచ మార్కెట్‌లో ఇంధన ధరలు పెరుగుతున్న నేపథ్యంలో వినియోగాన్ని తగ్గించాలని దేశ ప్రజలకు ప్రధాని మోదీ విజ్ఞప్తి చేశారు.




## కొండాపురం వద్ద కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్

కేటిదొడ్డి మండలం కొండాపురం గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ తనిఖీ చేశారు. కొనుగోలు కేంద్రంలో రైతులకు కల్పించిన సౌకర్యాలు, దిగుబడి వివరాలు, హమాలీల గురించి సంబంధిత అధికారులను, నిర్వాహకులను ఆయన అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్రానికి ముందుగా తీసుకొచ్చిన రైతుల ధాన్యానికి నిబంధనల ప్రకారం తేమ వస్తే వెంటనే తూకం చేసి మిల్లులకు తరలించాలన్నారు. ముందు వచ్చిన రైతులకు కాకుండా వెనుక వచ్చిన వారి ధాన్యం కొనుగోలు చేయడం సరికాదన్నారు. కొనుగోలు ప్రక్రియ పూర్తికాగానే ఓపిఎంఎస్ కాకుంటే రైతులకు సకాలంలో డబ్బులు అందక ఇబ్బందులు పడతారన్నారు. కేంద్రం నిర్వహకులు, సంబంధిత అధికారులు ఇష్టానుసారం వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్యాడి క్లీనర్స్ తో ధాన్యంను శుభ్రం చేయకుండా మిల్లులకు పంపిస్తే మిల్లర్లు అభ్యంతరాలు వ్యక్తం చేస్తారన్నారు. దొడ్డు, సన్నరకం ధాన్యం వివరాలను అడిగి తెలుసుకున్నారు. లారీలు, హమాలీల సమస్య ఈ కేంద్రాల వద్ద లేకపోవడంతో కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలన్నారు. ధాన్యం కుప్పలను పరిశీలించి నిర్దేశిత తేమ శాతం రాగానే తూకం చేయాలని నిర్వాహకులను ఆదేశించారు. లారీలలో సంబంధిత మిల్లులకు ధాన్యం పంపే క్రమంలో ఎలాంటి సమస్యలు రాకుండా చూడాలన్నారు. వివిధ రిజిస్టర్ లను పరిశీలించి, ట్రక్ షీట్ వివరాల్లో తప్పిదాలు ఉండడంతో సరిచేసి పంపాలని, నిబంధనలను అతిక్రమిస్తే షోకాజు నోటీసులు జారీ చేస్తామని ఈ సందర్భంగా కలెక్టర్ హెచ్చరించారు. కలెక్టర్ పౌర సరఫరాల శాఖ మేనేజర్ విమల, డిఆర్డిఏ ఏపీడి శ్రీనివాస్, కేటీ దొడ్డి తహసిల్దార్ కరుణాకర్, ఎంపీడీవో రమణారావు, విద్యాశాఖ ఇంజనీర్ మోహన్ రెడ్డి, మండల వ్యవసాయ శాఖ అధికారి రాజవర్ధన్ రెడ్డి, ఏపీఎం చంద్రశేఖర్, గ్రామ సర్పంచ్ పవన్ కుమార్ రెడ్డి, ఐకేపీ లీడర్ వినోదమ్మ, సెంటర్ నిర్వహకులు ఉన్నారు.

## పేదలకు సంక్షేమ ఫలాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యం: ఎమ్మెల్యే జిఎంఆర్

**కొత్తకోట,మే14(నమస్తే ఉదయం)**



పేదలకు సంక్షేమ ఫలాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని దేవరకద్ర ఎమ్మెల్యే జిఎంఆర్ అన్నారు. గురువారం మండలంలోని రామకృష్ణ పురం గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల గృహ ప్రవేశ కార్యక్రమాల్లో పాల్గొని, అనంతరం ఇందిరమ్మ ఇండ్ల జాబితా లబ్ధిదారులకు (కొత్త బట్టలు) నూతన వస్త్రాలను అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.రామకృష్ణాపురం గ్రామానికి చెందిన గృహప్రవేశం బండారు కురుమన్న యాదవ్, చిన్నపాగ కొండన్న, ఎండి రహీంలకు నూతన వస్త్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సి డి సి చైర్మన్ మూలమల్ల చంద్రశేఖర్ రెడ్డి, మాజీ వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ మూలమల్ల వెంకటేశ్వర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు శివరాములు పాల్గొన్నారు.





## రాష్ట్రస్థాయి ప్రతిభ పురస్కారాలు అందుకున్న గద్వాల విద్యార్థులు

**గద్వాల జిల్లా ప్రతినిధి, మే14 (నమస్తే ఉదయం)**

వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గురువారం హైదరాబాద్‌లోని బంజారా భవనంలో పదవ తరగతి మరియు ఇంటర్మీడియట్‌లో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు రాష్ట్రస్థాయి ప్రతిభ పురస్కారాల ప్రదానోత్సవం ప్రదానోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతిభ కనబరిచిన జోగులాంబ గద్వాల జిల్లాకు చెందిన విద్యార్థులను రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి, హనుమంతరావు, బి.సి సంక్షేమ శాఖ కమిషనర్ బాలా మాయాదేవి , మరియు గురుకుల సొసైటీ సెక్రటరీ సైదులు సత్కరించారు. విద్యార్థులకు రూ. 10,000 నగదు పురస్కారం అందించి, జ్ఞాపిక మరియు శాలువాతో ఘనంగా సత్కరించారు. ప్రభుత్వ వసతి గృహాల్లో ఉంటూ విద్యనభ్యసించి, అద్భుత ప్రతిభ కనబరిచిన వారిలో గద్వాల జిల్లాకు చెందిన కె రాకేష్ (554 మార్కులు, ధరూర్ ప్రభుత్వ బీసీ బాలుర వసతిగృహం విద్యార్థి), హర్షిత్ (567 మార్కులు -శాంతినగర్ ప్రభుత్వ బీసీ బాలుర వసతిగృహం), జి. నాగలక్ష్మి (981 మార్కులు, ఇంటర్మీడియట్ సెకండియర్, కాలేజీ గర్ల్స్ హాస్టల్, గద్వాల్) గోపాల్ నాయక్ (953 మార్కులు , ఇంటర్మీడియట్ సెకండియర్, కాలేజీ బాయ్స్ హాస్టల్, గద్వాల్) మంజునాథ్ (476 మార్కులు, ఇంటర్మీడియట్ ఫస్టియర్, కాలేజీ బాయ్స్ హాస్టల్, గద్వాల్) ఉన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను బి.సి సంక్షేమ శాఖ కమిషనర్ బాలా మాయాదేవి ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లాకు చెందిన హాస్టల్ వార్డెన్ లు ఉన్నారు.



## శంషాబాద్ ఎయిర్ పోర్ట్ నుంచి విమానాల దారి మళ్లింపు

**శంషాబాద్,మే14 (నమస్తే ఉదయం)**

శంషాబాద్ విమానాశ్రయంలో వాతావరణం అనుకూలించకపోవడంతో రెండు విమానాలను దారి మళ్లించారు.ల్యాండింగ్‌కు వాతావరణం అనుకూలంగా లేకపోవడంతో పలు విమానాలను దారి మళ్లించారు.కొన్ని విమానాలు బెంగళూరు, విజయవాడ వైపు వెళ్లాయి.లఖనవూ,కోల్కతా, ముంబయి, జయపుర నుంచి వచ్చే బెంగళూరుకు డైవర్ట్ చేశారు.బెంగళూరు నుంచి హైదరాబాద్ వచ్చే విమానాన్ని విజయవాడకు దారి మళ్లించారు. పరిస్థితి అనుకూలించడంతో తిరిగి విమానాలు వచ్చాయి.కార్యకలాపాలు యథావిధిగా కొనసాగుతున్నాయని విమానాశ్రయ అధికారులు తెలిపారు.




## ప్రభుత్వ మహిళా డీగ్రీ కళాశాల ప్రజా పాలన... ప్రగతి ప్రణాళిక కార్యక్రమం

**గద్వాల జిల్లా ప్రతినిధి మే 14(నమస్తే ఉదయం)**

ప్రియదర్శిని ప్రభుత్వ మహిళా డీగ్రీ కళాశాల ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా 4వ రోజు పూర్వ విద్యార్థుల సమావేశాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షురాలు ఎం. మానస మరియు కార్యదర్శి శశికళ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు తమ విద్యార్థి దశ జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ కళాశాల అభివృద్ధికి ఎల్లప్పుడూ సహకరిస్తామని తెలిపారు. ఉన్నత విద్యను అభ్యసిస్తున్న పూర్వ విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎ. మీనాక్షి గారు సన్మానించి అభినందించారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని, కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ కళాశాలలో చదివిన విద్య తమ జీవిత పురోగతికి ఎంతో ఉపయోగపడిందని, భవిష్యత్తులో కళాశాల అభివృద్ధి కార్యక్రమాలు, విద్యార్థుల మార్గదర్శకత్వం, కెరీర్ అవగాహన కార్యక్రమాలలో తమ వంతు సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం కళాశాల ప్లానింగ్ అండ్ డెవలప్‌మెంట్ కమిటీ సభ్యుడు ఎం. సాయి శామ్ రెడ్డి తో ప్రిన్సిపాల్ సమావేశం నిర్వహించి కళాశాల అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. విద్యార్థులకు మరింత మెరుగైన సౌకర్యాలు కల్పించడం, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించడం, పూర్వ విద్యార్థుల భాగస్వామ్యాన్ని పెంపొందించడం వంటి అంశాలపై నిర్ణయాలు తీసుకున్నారు.ఈ సమావేశంలో పూర్వ విద్యార్థుల సంఘ సమన్వయకర్త బి. జగన్ మోహన్, వైస్ ప్రిన్సిపాల్ లక్ష్మీ ప్రసాద్ మరియు అధ్యాపకులు పి. సురేష్ బాబు, ఎం. దేవుజ, డా. ఎం. సమత, వనిత, బ్రహ్మేశ్వర్, వెంకటేష్, సాయి తేజ మరియు శ్రీకాంత్ పాల్గొన్నారు.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of VANITHA Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: M.DAMODHAR REDDY. "RNI. Title- Code: TELTEL/2023/87699**. Cell: 9492148733